ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 21 : జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు 24 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను నేరుగా నల్గొండ తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని, పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు రిపోర్ట్ అందించేలా వ్యవస్థ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, పోలీస్ కమిషనర్

జాతీయ అథ్లెటిక్స్‌లో మైథిలీకి కాంస్యం

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 21 : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగిన 38వ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన ఏ మైథిలీ కాంస్యం పతకం సాధించింది. జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ పోటీలకు 400x100 మీటర్ల విభాగంలో నలుగురితో కూడిన జట్టులో ఆమె తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. గతంలో కూడా జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్, రెండు రజతాలు, 3 కాంస్య పతకాలు గెల్చుకున్నారు. తాజాగా కాంస్యం సాధించి జిల్లా కేంద్రానికి చేరుకున్న క్రీడాకారిణిని శుక్రవారం డీవైఎస్‌వో తనవెంట తీసుకుని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మైథిలీని అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డితోపాటు అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, వాలీబాల్ కోచ్ ఎండీ అక్బర్‌అలీ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

ఖమ్మం ఫిబ్రవరి 21 : చేగువేరా భూపతి ఫౌండేషన్ బాధ్యులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న 670మందిని పోషిస్తున్న తీరును ఫౌండేషన్ చైర్మన్ జి.చంద్రశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. వృద్ధులకు సరైన వసతి లేక ఎంతోమంది చనిపోతున్నారని, ఖమ్మంలో వృద్ధాశ్రమం నిర్మించేందుకు ప్రభుత్వం తరపున సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీబీఎఫ్ సభ్యులు గంటా భీమయ్య, సప్పిడి నాని, పడిశాల వెంకట్, జి.రాధిక, డి.హర్ష, బి.హరిత, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

యశోద ఆసుపత్రిలో అరుదైన గుండె ఆపరేషన్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 21 : హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో అరవై నాలుగేండ్ల వృద్ధురాలికి అరుదైన గుండె ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడామని స్థానిక ఎండీ, డీఎం డాక్టర్ రవికాంత్(కార్డియాలజీ) తెలిపారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతానికి చెందిన బేతల సుమిత్ర(64) గుండె సంబంధిత వ్యాధితో క్రిటికల్ పరిస్థితిలో తమ హాస్పిటల్‌లో చేరారన్నారు. అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుని, అధునాతన పద్ధతులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన చికిత్సను అందించామన్నారు. తమ ఆసుపత్రిలో ప్రభుత్వం కల్పించే హెల్త్ రీయింబర్స్‌మెంట్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను ఆమోదిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవికాంత్

ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేత

ఖమ్మం, ఫిబ్రవరి 21 : కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ ఈ.లోకేశ్, ఏఆర్ కానిస్టేబుల్ ఐ.బాలరాజు కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖాపరంగా సహాయం అందించేందుకు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. పోలీసు కుటుంబాలను అన్నివిధాల ఆదుకుంటామన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న పోలీస్ కమిషనర్

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే గంగుల

ఖమ్మం, ఫిబ్రవరి 21 : తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి కాశీ విశ్వనాథస్వామికి ప్రత్యేక పూజలు చేసి వేడుకున్నారు. మహా కుంభమేళా సందర్భంగా శుక్రవారం వారు ప్రయాగరాజ్(అలహాబాద్) వద్ద త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలాచరించి కాశీ విశ్వనాథస్వామిని దర్శించుకున్నారు. వారితోపాటు ఖమ్మం నగర బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ(ఆర్జేసీ) దంపతులు ఉన్నారు.

కాశీ విశ్వనాథస్వామి సన్నిధిలో వద్దిరాజు, గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు

పువ్వాడ ఉదయ్‌కు నివాళి

ఖమ్మం/ ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 21 : సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు తనయుడు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోదరుడు పువ్వాడ ఉదయ్‌కుమార్ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. మమత ఆసుపత్రి ఆవరణంలో గల ఉదయ్‌కుమార్ ఘాట్ వద్ద మాజీ మంత్రి అజయ్‌కుమార్, ఆయన సతీమణి వసంతలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జాయింట్ సెక్రటరీ దండి సురేష్, సలాం, గాంధీ, వల్లభనేని రామారావు పాల్గొన్నారు.

ఉదయ్‌కుమార్‌కి నివాళి అర్పిస్తున్న అజయ్ దంపతులు

సందడిగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 21 : ఖమ్మం నగరం మమత రోడ్డులో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 3వ వార్షికోత్సవం శుక్రవారం సందడి సందడిగా సాగింది. ఈ వేడుకకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయం ఇన్‌చారిజ తంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన 'నాన్న ఎందుకో వెనకబడ్డాడు..' అనే నాటకం సభీకులను ఆకర్షించింది. ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా స్కూల్ యాన్యువల్ రిపోర్టును చదివి వినిపించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయంగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన వశిష్ట క్యాంపస్‌లో అన్ని తరగతులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దయాకర్‌రెడ్డి

మార్చి నెల బియ్యం సరఫరా ప్రారంభించండి

జిల్లా మేనేజర్‌ను కలిసిన రేషన్‌డీలర్స్ నేతలు

డీఎం శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 21 : రేషన్‌షాపులకు మార్చి నెల బియ్యం సరఫరాను త్వరితగతిన ప్రారంభించాలని ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ నేతలు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలతను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు అదనంగా బియ్యం లారీలను తెప్పించి ఈ నెలఖారులోగా షాపులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా ఉన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 21 : బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఖమ్మంజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమాఖ్య ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జాతీయ సంఘాల సమమాఖ్య తలపెట్టిన సమ్మెకు కొనసాగింపుగా శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టాలని, ఐదురోజులు మాత్రమే పనిదినాలు కేటాయించాలన్నారు. బ్యాంకు సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల గ్రాట్యూటీ చట్టాన్ని సవరించి గ్రాట్యుటీని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూబీఐ ఉద్యోగులు విష్ణువర్ధన్, దేవేందర్, లవణ్‌కుమార్, సాయి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★ I, **AMGOTH RAVINDRA NAIK,** S/o AMGOTH BABU, Residing at H.No: 1-121, Kotha Thanda Village, Andanala Padu, Manneguden, Seerole Mandal, Mahabubabad District, Telangana State - 506381, have changed my name to **AMGOTH RAVINDAR NAIK.** Henceforth, I shall be known as **AMGOTH RAVINDAR NAIK** for all purposes.

KMM

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మం అర్బన్/ రఘునాథపాలెం, ఫిబ్రవరి 21 : ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలగూడేనికి చెందిన యోగానందిని(16) ఖమ్మం నగరంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. శుక్రవారం ఉదయం కళాశాల హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికే గుర్తించిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. యోగా నందిని చేతికి ఇటీవల సర్జరీ కావడంతో కళాశాలలో జరిగే పరీక్షలు రాయలేకపోయింది. దీంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి సత్యరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖానాపురం హవేలీస్టేషన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

ఆలిండియా ఉషు పోటీలకు పవిత్రాచారి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 21 : ఆలిండియా యూనివర్శిటీ ఉషు పోటీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంకు చెందిన పొడకంటి పవిత్రాచారి పాల్గొనబోతున్నది. నేటి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు చండీఘర్ యూనివర్శిటీలో జరుగనున్న పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున హాజరవుతున్నది. గతంలో జమ్ముకాశ్మీర్ యూనివర్శిటీలో జరిగిన పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించి మూడోస్థానంలో నిలిచింది. తాజాగా నాన్ క్వాన్, నాన్ దావో, నాన్ గున్ అను మూడు ఈవెంట్స్‌లో పోటీకి దిగుతున్న ఆమెను శుక్రవారం జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. చక్కని ప్రతిభను కనబరిచి పతకాలను సాధించి ఖమ్మానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉషు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొడకంటి పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

బీపీఈడీ కళాశాలలో జాబ్ మేళా

ఖమ్మంఅర్బన్, ఫిబ్రవరి 21 : ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఈడెన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో సంస్థ నిర్వాహకులు నాగబాబు, శేఖర్, డేవిడ్ పాల్గొని విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పరీక్షించారు. 20మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు.

రేపు ఖమ్మంలో నెలనెలా వెన్నెల

ఖమ్మం, ఫిబ్రవరి 21 : నెలనెలా... వెన్నెల 91వ నెల కార్యక్రమం ఈ నెల 23వ తేదీ ఆదివారం సాయంత్రం 6గంటలకు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్రావు, కె దేవేంద్ర, డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్తం..

పలు కుటుంబాలను పరామర్శించిన సండ్ర

కేఎం.బంజరలో పలువురిని పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే

పెనుబల్లి, ఫిబ్రవరి 21: మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటకవీరయ్య శుక్రవారం పరామర్శించారు. కర్రాలపాడు, తాళ్లపెంట గ్రామాలకు చెందిన ఆళ్ల రంగ తాతయ్య ఆళ్ల పిచ్చయ్య, గువ్వల వంశీకృష్ణారెడ్డి, ముత్తగూడెం గ్రామ శివారు సీతారాంపురం గ్రామానికి చెందిన యరమల సత్యావతి, గణేష్‌పాడు శివారు ఎల్ఎస్.బంజర గ్రామానికి చెందిన నాగళ్ల చిట్టెమ్మ, కేఎం.బంజర గ్రామానికి చెందిన తుమ్మలపల్లి మురళీ, మండాలపాడు గ్రామానికి చెందిన గాయం రామారావు ఇటీవల మృతిచెందగా వారి ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. తాళ్లపెంట మాజీసర్పంచ్ సూరపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి నర్సింహారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనను వారి స్వగృహంలో పరామర్శించారు. సండ్ర వెంట వెంకట్రావు, మోహన్‌రావు, అశోక్‌కుమార్, లక్ష్మణరావు, గోవిందరావు, నాగిరెడ్డి, టీవీ రామారావు, గిరిజాపతి ఉన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

పెనుబల్లి, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ శుక్రవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-పాస్ యంత్రాల ద్వారా పారదర్శకంగా యూరియా విక్రయం జరగాలన్నారు. ప్రతి మండలంలో యూరియా స్టాక్‌ను రైతులకు అందుబాటులో పెట్టామని, ఎక్కడ కొరత లేదని తెలిపారు. ఎడ్లబంజర గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంపీవో ఉపేంద్ర, ఏవో ప్రసాదరాజు పాల్గొన్నారు.

శివరాత్రికి ఖమ్మం రీజినల్‌లో ప్రత్యేక 75 బస్సులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 21: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఖమ్మం రీజినల్ పరిధిలో 75 ప్రత్యేక బస్సులు ఏర్పాట చేశామని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరాం అన్నారు. శుక్రవారం నీలాద్రి ఆలయాన్ని సందర్శించిన అనంతరం సత్తుపల్లి డిపోలో జరుగుతున్న సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నుంచి నీలాద్రికి 25 బస్సులు, ఖమ్మం నుంచి తీర్థాలకు 25 బస్సులు, వైరా నుంచి స్నానాలలక్ష్మీపురానకి 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి అదనంగా బస్సులు నడుపుతామన్నారు. డిప్యూటీ ఆర్ఎంవోజీ ఎన్.పవిత్ర పాల్గొన్నారు.

అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

కొణిజర్ల, ఫిబ్రవరి 21: మండలంలోని తనికెళ్లలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న మైనార్టీ గురుకుల కళాశాల ఆఫ్ ఎక్స్‌లెన్స్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.జితేష్‌షాహిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆదివారం ఉదయం 10 గంటల లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

వైరాటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాలని విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి కోరారు. శుక్రవారం కళాశాలలో కళాశాల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ (ఇంగ్లిష్, తెలుగు మీడియం) వృత్తి విద్య కోర్సులు ఏఈటీ, ఎంఈ ఉన్నాయన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి..

వైరాటౌన్, ఫిబ్రవరి 21: మున్సిపాలిటీలో పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వైరా మున్సిపాల్ కమిషనర్ చింతా వేణు అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని మధిర రోడ్డులో కమిషనర్ షాపుల నిర్వాహకులతో మాట్లాడి పన్నులు కట్టించారు.

టాలెంట్‌టెస్టులో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 21: మండల స్థాయిలో జరిగిన టాలెంట్‌టెస్టు, క్విజ్ పోటీల్లో ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 60 మందికి పైగా పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి యనమల కార్తీక్, హేమచందు, గణేశ్‌మూర్తిల టీఎం క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం, టాలెంట్‌టెస్టులో 4వ తరగతి విద్యార్థి గణేశ్‌మూర్తి ప్రథమస్థానం, సుమంత్ తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ చైర్మన్ శైలకుమారి, హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లాల్‌అహ్మద్, శేషుకుమార్, నర్సింహారావు, వెంకటేష్, విజయ, తల్లిదండ్రులు అభినందించారు.

సరస్వతికి నివాళి

వైరాటౌన్, ఫిబ్రవరి 21: పట్టణానికి చెందిన కాటేపల్లి రామకృష్ణ భార్య కాటేపల్లి సరస్వతి దశదిన కర్మకు డాక్టర్ కాపా మురళీకృష్ణ హాజరై ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సరస్వతి నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి అందజేయగా శుక్రవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు నేత్రనిధి సర్టిఫికెట్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతుల ఆందోళన

మధిర, ఫిబ్రవరి 21: సాగర్ కాలువలపై తూముల షట్టర్లను మూసివేయడం పట్ల రైతులు సాగర్ కాలువపై ఆందోళన చేశారు. చింతకాని మండలంలోని తూటికుంట్ల మేజర్ కాలువ వద్దకు రైతులు శుక్రవారం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తూటికుంట్ల మేజర్ కాలువకు నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. రైతులు గడ్డం శ్రీనివాసరావు, కనగంటి భూపతి, మద్దిని వెంకటేశ్వర్లు, పంది సత్యం, సోలా రమేష్, కోటి రామారావు, బొరిగర్ల సత్యం, షేక్ జానీ, షేక్ ఫరీద్, రాయల శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పక్షాన నిలబడుతా..

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 21 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గత 6 సంవత్సరాలు ఉపాధ్యాయుల, అధ్యాపకుల పక్షానే నిలిచానని, మళ్లీ ఈసారి కూడా గెలిపిస్తే మరింత అండగా ఉంటానని వరంగల్-నల్గొండ-ఖమ్మం నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ నెల 27న మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దుర్గాభవాని, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రంజాన్, విజయ్, వెంగళరావు పాల్గొన్నారు.

న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 21 : ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు విజ్ఞానదర్శిని నిర్వహించిన సైన్స్ మాసోత్సవాల్లో ఐదు బహుమతులు గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ అబాద్‌అలీ తెలిపారు. కవితారచనలో నయశ్రీ, సైంటిస్టుల వేషధారణలో రిజ్వాన్ అహ్మద్, కథారచనలో నిఖిల, వ్యాసరచనలో మనస్వి, చిత్రలేఖనంలో నిదాపిర్దోస్‌లు బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, డైరెక్టర్ స్ఫూర్తి, తెలుగు ఉపాధ్యాయులు రమేష్ అభినందించారు.

సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 21 : ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ నీలిమ తెలిపారు. జయదేవ్‌చౌహాన్, అక్షయ్‌రుత్విక్ ప్రథమస్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్ పవిత్ర అభినందించారు.

'చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి'

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని లీడ్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు దాసరి రంజిత్, డాక్టర్ బీ.సుదర్శన్ సూచించారు. మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రియదర్శిని కళాశాల, లీడ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం 'ఆప్ బదే - దేశ్‌కో బదే' అనే అంశంపై మొదటి సంవత్సరం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తరువాత కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ.. నేటి యువతలో నైతికతను పెంచడమే తమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రిన్సిపాల్ గోపాల్, డైరెక్టర్ వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

'సాగర్ జలాలు పంటలకు అందేలా పర్యవేక్షించాలి'

బోనకల్లు, ఫిబ్రవరి 21: సాగర్ జలాలు పంటలకు అందేలా పర్యవేక్షించాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ ఆదేశించ